క్లుప్తంగా

పదవీ విరమణ పొందిన ఏఈ శ్రీనివాసరావుకు సత్కారం



అమరావతి: మండలంలో సుదీర్ఘకాలం హౌసింగ్ ఏఈగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేసిన శ్రీనివాసరావు మండల ప్రజలకు అందించిన సేవలను గుర్తించి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సన్మానించారు. విశ్రాంత ఏఈ శ్రీనివాసరావును క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు వెంపా వాసు, విన్నకోట వాసు తదితరులు ఆయనను సత్కరించి ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి

పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి



బెల్లంకొండ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు మండలంలో తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన పార్టీ మండల అధ్యక్షుడు అన్నపరెడ్డి నర్సిరెడ్డి తెలిపారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిత్యం ప్రజాపక్షంగా ఉంటుందని ఆయన తెలిపారు. వైఎస్సార్ స్వర్ణయుగం జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తనను వైఎస్సార్‌సీపీ గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

పింఛన్లు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని 16వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోరు పంపు ఏర్పాటు



అమరావతి: మండల కేంద్రమైన అమరావతి మొదటివార్డు పూజారివీధిలో త్రాగునీటికి, వాడుకునే నీటికి ఇబ్బంది పడకుండా మండల పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం బోరు పంపు ఏర్పాటు చేశారు. తొలుత మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు, ఎంపీడీవో పార్వతి, బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, మేకల శివశంకర్‌లతో పాటు సల్లిబోయిన శేఖర్ తదితరులు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఎంతో కాలంగా పూజారివీధిలో బోరుపంపు లేక ఇబ్బంది పడుతున్నందు వల్ల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి సాయిబాబు, ఘంటసాల బాబావరప్రసాద్, శంకరమంచి నరసింహారావు, కైతేపల్లి సుధీర్, గోళ్లమూడి సుధీర్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు అభినందన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పదోన్నతిపై ప్రధానోపాధ్యాయులుగా వెళుతున్న ఉపాధ్యాయులు, బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. పాఠశాలలో గణితం, సైన్స్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పూర్ణచంద్రరావు, ఏజీఎం శ్రీనివాసరావులు అచ్చంపేట మండలం మాదిపాడు, ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. వీరితో పాటు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న జీ రమేష్ సత్తెనపల్లి మండలం కట్టమూరుకు బదిలీ అయ్యారు. మరో 9 మంది ఉపాధ్యాయులు బదిలీ కావటంతో వారందరికీ అభినందన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం అవస్థలు

- క్రోసూరు చెరువులో ఐదునెలలుగా నీళ్లు లేని పరిస్థితి
- అరకొరగా పంచాయతీ టాంకర్ల ద్వారా సరఫరా
- బావులు, బోర్లలో నీళ్లు లేక అడుగంటిన దుస్థితి
- వర్షాలు పడటం, సాగర్ నీళ్లు విడుదలైతేనే చెరువుకు నీళ్లు
- చేపల కోసం చెరువులో నీటిని జనవరిలోనే వదిలిన వైనం
- పట్టించుకోని మైనర్ ఇరిగేషన్ అధికారులు



క్రోసూరులోని బావులలో అడుగంటిన జలాలు

క్రోసూరు: గుక్కెడు నీటి కోసం క్రోసూరు గ్రామ ప్రజలు వర్షం కోసం, సాగర్ కాలువ రాక కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి. బావుల్లో, బోర్లలో, ఎక్కడా నీళ్లు లేక భూ గర్భజలాలు అడుగంటిన పరిస్థితి నెలకొంది. ఐదు నెలలుగా నీళ్ల కోసం గ్రామంలోని ప్రజల అవస్థలు ఇవి. క్రోసూరుకు 500 ఎకరాలలో అతిపెద్ద సామాజిక చెరువు ఉంది. దానిలో చేపలు పట్టడానికి జనవరి నెలలోనే చెరువు నీళ్లు బయటకు వదిలేశారు. అప్పటి నుంచి చెరువు పూర్తిగా ఖాళీ అయింది. కనీసం పశువులకు కూడా నీళ్లు దొరకటం లేదు.

ట్యాంకర్ల ద్వారా అరకొరగా...

గ్రామంలో నీటి ఎద్దడి బాగా ఉండటంతో పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా వీధుల్లో నీళ్లు సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు రెండు ట్యాంకర్ల ద్వారా సుమారు 15 వీధులకు నీళ్లు సరఫరా చేస్తున్నారు. కానీ అరకొరగా సరఫరా చేస్తున్న ఆ నీళ్లు సరిపోవడం లేదని, అందరికీ అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

క్రోసూరు గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా, రైతులకు సాగునీరు అందిస్తున్న అతిపెద్ద పురాతన చెరువు నేడు నీళ్లు లేక విలవిలలాడుతుండటంతో గ్రామ ప్రజలకు కూడా నీళ్ల అదే పరిస్థితి వచ్చింది. వర్షాకాలంలో వర్షాలు పడితే ఎగువన పొంగి వచ్చిన నీటితో చెరువుకు నీళ్లు చేరతాయి. లేదా సాగర్‌కెనాల్స్ కాలువలకు నీళ్లు వదిలేతేనే చెరువుకు నీళ్లు చేరతాయి. ప్రస్తుతం అడపాదడపా చినుకులు పడటమే కానీ జూలై నెల వచ్చినప్పటికీ వర్షాలు ఎప్పుడు కురుస్తాయా, సాగర్‌కు నీళ్లు ఎప్పుడు వస్తాయా అని గ్రామ ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు సరియైన వర్షాలు క్రోసూరులో లేవనే చెప్పవచ్చు. చెరువులో నీళ్లు వెళ్లబెట్టకుండా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ప్రజలు చెప్పుకుంటున్నారు. కానీ పట్టించుకునే అధికారులు లేకపోవటంతో ప్రజలు దేవుడివైపు చేతులు చాచి కరుణించమని వేడుకుంటున్నారు.



పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

తీర్మానం అమలు చేయాలి



చెరువులో నీళ్లు ఉంటే బావుల్లో, బోర్లలో నీళ్లు వస్తాయి. చెరువును మంచి నీటి చెరువు, సాగునీటి చెరువుగా (రెండు భాగాలు) చేయాలని తీర్మానం చేసి ఏళ్లు గడుస్తుంది. అలా చేస్తేనే క్రోసూరుకు నీటి ఎద్దడి సమస్య పోతుంది.

– పోతుగంటి లక్ష్మి, క్రోసూరు

అందరికీ అందటం లేదు



మేము చెరువుకు దగ్గర బజారులోనే నివసించే వాళ్లం. చెరువులో నీళ్లు లేక పోవటంతో బోర్లలోనూ నీళ్లు రావటం లేదు. పంచాయతీ ట్యాంకర్లు పెట్టినా ఆ నీళ్లు అందరికీ అందటం లేదు.

– షేక్ అష్రఫున్, క్రోసూరు

శాశ్వత పరిష్కారం చూపాలి



పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు క్రోసూరు చెరువు నీటిపై శాశ్వత పరిష్కారం చూపాలి. నీళ్లు మొత్తం వదిలిపెట్టటంతో భూగర్భ జలాలు లేకపోవటంతో నీళ్లు లేక అవస్థలు పడుతున్నాం. అధికారులు సీరియస్‌గా పట్టించుకోవాలి.

– షేక్ జానీ బేగం, క్రోసూరు

అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి



రైతులకు సూచనలిస్తున్న ఏవో కె.దేవదాసు



రైతులతో మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

సత్తెనపల్లి: రైతులు అధీకృత డీలర్ల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని సత్తెనపల్లి మండల వ్యవసాయధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరులయిన జనుము, జీలుగ, పిల్లిపెసర పంటలు సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియదున్నుకోవాలన్నారు. కౌలు రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా భూ యజమానులు అంగీకారంతో పంట సాగు హక్కు పత్రాలు పొందాలన్నారు. మిరప సాగు చేసే రైతులు షేడ్ నెట్‌లలో నారు పెంచుకోవాలని, ఇలా పెంచుకోవటం వలన ఆరోగ్య వంతమైన మిరపనారు, తెగుళ్ల, పురుగుల తాకిడి తగ్గించవచ్చునన్నారు. తొలకరి వర్షాలకు నవధాన్యాలను సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియదున్నుకోవాలని సూచించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈవో శేషుబాబు, వీఏఏలు, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి

నకరికల్లు: నీటిబావులు, బోరుబావుల కింద నీటి వసతి కలిగిన రైతులు వరి నారు మడులు సిద్ధం చేసుకునే నేపథ్యంలో ఒక కేజీ వరి విత్తనాలకు 1 గ్రాము కార్బండిజం లేదా 10 గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరోసిస్‌తో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చల్లగుండ్ల అడ్డరోడ్డు, దేచవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10–12రోజుల వ్యవధిలో నారుమడిని మూడు దఫాలుగా దమ్ముచేసి చదును చేసుకోవాలన్నారు. నారుమడికి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా చిన్నపాటి కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారు ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరుతడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కె.దిలీప్‌కుమార్, ఎంపీఓ కె.రవిబాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు తప్పనిసరిగా పొందాలి

బెల్లంకొండ: పంటలను సాగుచేసే కౌలు రైతులు కౌలు కార్డులను తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని నందిరాజుపాలెం, న్యూ చిట్యాల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించి కౌలు కార్డులు పొందాలన్నారు. పత్తి సాగు చేపట్టిన రైతులకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని తెలిపారు. పంటల బీమా నమోదు గడువు జూలై 15 వరకు ఉందని, బ్యాంకు పాస్ బుక్, ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్‌లతో మీ సేవ, రైతు సేవా కేంద్రాల్లో చెల్లించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

బొల్లవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.వి.నారాయణ పాల్గొని మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కౌలు రైతులు సాగుదారు పత్రాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి

ఏడీఏ హనుమంతరావు



రెడ్డిగూడెం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

రాజుపాలెం: భూమిలో పైరును విత్తుకునే ముందుగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ భూమిలో సరిపడా తేమ ఉన్నప్పుడే విత్తనాన్ని నాటాలని తెలిపారు. దీని వలన మొలక శాతం బాగా రావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య మాట్లాడుతూ ఏపీ సీడ్స్ వ్యవసాయ శాఖ ద్వారా వరి బీపీటీ 5204, జేజీఎల్ 368, కేఎన్ఎం 1638 రకాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఐదు రూపాయల సబ్సిడీ పోను కిలో రూ.33కే ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో అల్లాభక్షి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు.. కనిపించే దేవుళ్లు

- సీనియర్ లయన్ వెంకటేశ్వరరావు
- ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



ఏరియా వైద్యశాల సుపరింటెండెంట్ లక్ష్మణరావును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

సత్తెనపల్లి: సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం అని, ఆపద సమయంలో ప్రజలందరికీ ఆపద్బాంధవుడిలా ఆదుకునే వైద్యులు కనిపించే దేవుళ్లతో సమానమని సీనియర్ లయన్ కంబాల వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ ఆళ్ల శారద, డాక్టర్ స్థిమిత, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ సాయి కృష్ణ, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వీవీఆర్ కృష్ణమాచార్యులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంబాల వెంకటేశ్వరరావు, పలువురు వక్తలు వైద్యుల సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, కార్యదర్శి రమేష్, మాజీ అధ్యక్షుడు కిషోర్, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజు, పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

దేవుని తర్వాత దేవుడు అంతటి వారు వైద్యులని రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, వాసవీ మణికంఠ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో తక్కువ సమయంలో వైద్య వృత్తిలో పేదల హృదయాల్లో స్థానం సంపాదించిన డాక్టర్ హిమబిందు, డాక్టర్ చిరంజీవిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. వాసవీ మణికంఠ క్లబ్ అధ్యక్షుడు కాశీ వెంకట సుబ్బారావు, సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ కాశీ విశ్వేశ్వరరావు, ఆవులమంద కమలాకర్, రమేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడిలో మంగళవారం ఆషాఢ శుద్ధ షష్ఠి, కుమార షష్ఠి సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. పుణ్య దంపతులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ కార్డులు పొందాలి



నకరికల్లు: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా వ్యవసాయ సంక్షేమ పథకాలు పొందవచ్చని డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అలాగే నకరికల్లు, చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, చాగల్లు గ్రామాల్లో కౌలు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీబీఆర్సీ ఆధ్వర్యంలో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతుల సచివాలయంలోని వీఆర్వోలను కలసి కార్డులు పొందవచ్చన్నారు. తహసీల్దార్ కె.పుల్లారావు మాట్లాడుతూ భూ యజమానులు, కౌలు రైతులు వ్యవసాయ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీబీఆర్సీ సిటీ కో ఆర్డినేటర్ తోకల సాంబయ్య, డి.డి.కోటిరెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పెరికపాడు పేదలకు సాగు భూమి ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

క్రోసూరు: పెరికపాడు గ్రామంలో సాగు భూమి లేని పేదలకు సాగు భూమిని ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పెరికపాడు పేదలతో కలిసి సాగు భూమిని ఇవ్వాలని తహసీల్దార్ వీవీ నాగరాజుకు వినతి పత్రాన్ని అంచేసారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పెరికపాడు గ్రామ పరిధిలోని అడవి సరిహద్దు ప్రాంతంలో అన్ సర్వే రెవెన్యూ భూమి ఉన్నట్లుగా గతంలో పేదలు ఆందోళన చేసిన సందర్భంలో రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు చెప్పారు. అప్పటి నుంచి సాగు భూమి లేని పేదలు ఆ భూమిని అర్హత కలిగిన వారికి పంచాలని ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పేదలకు భూమిని పంచుతామని అప్పటి అధికార పార్టీ నాయకులు హామీ కూడా ఇవ్వటం జరిగిందన్నారు. ఇప్పటికైనా అర్హత కలిగిన పేదలకు సాగు భూమిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు టి.హనుమంతరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ముత్యాల పోలు, పేదలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం

ఎంఈవో సత్యనారాయణ



దర్శి నిర్మల, రహంతుల్లాలను సన్మానించిన హెచ్‌డబ్ల్యూ పాఠశాల ఉపాధ్యాయ బృందం

పెదకూరపాడు : ఉపాధ్యాయులు దర్శి నిర్మల, రహంతుల్లాలు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమని పెదకూరపాడు ఎంఈవో సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదకూరపాడు గ్రామంలోని హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా దర్శి నిర్మల, రహంతుల్లాలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. వీరు హెచ్‌డబ్ల్యూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఎంతో కృషి చేసి తల్లితండ్రుల మన్ననలు పొందారు. వారి సేవలను అభినందిస్తూ మంగళవారం హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో హెచ్ఎం రాయపూడి సాంబశివరావు, శీలంనేని సాంబశివరావుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ సత్యనారాయణ, గ్రామ పెద్దలు బెల్లంకొండ రాంగోపాలరావు, బెల్లంకొండ శేషగిరి, షేక్ ముస్తఫాలు పాల్గొన్నారు. ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులు దర్శి నిర్మల, రహంతుల్లాల సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో విధులను నిర్వహించటం తమ కర్తవ్యంగా భావించాలన్నారు. గత 8 సంవత్సరాలలో తమకు సహకరించిన గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

వృత్తిని దైవంగా భావించాలి

ప్రముఖ వైద్యులు మధుసూదనరావు



డాక్టర్ మధుసూదనరావును సత్కరిస్తున్న ఆర్ఎంపీ వైద్యులు

అచ్చంపేట: అన్ని వృత్తులలో వైద్య వృత్తి చాలా గొప్పదని, వృత్తిని దైవంగా భావించి అంకిత భావంతో పని చేయాలని ప్రముఖ వైద్యులు ఎం.మధుసూదనరావు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాను సుమారు 50 సంవత్సరాల క్రితం పల్లెల్లో వైద్య చేయాలన్న లక్ష్యంతో అచ్చంపేటకు వచ్చానన్నారు. ఆ రోజులలో బస్సులు కూడా సక్రమంగా ఉండేవి కావని, పక్క మండలం నుంచి అడవుల గుండా డోలె కట్టుకుని రోగులను తీసుకు వచ్చేవారని చెప్పారు. వైద్య వృత్తిని దైవంగా భావించి, సేవే లక్ష్యంగా వైద్య సేవలను అందిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం అచ్చంపేట మండలంలో 80 మందికి పైగా ఆర్ఎంపీ వైద్యులు ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. తాను వచ్చిన కొత్తల్లో ఇద్దరే ఉండేవారన్నారు. అంకితభావంతో పనిస్తూ వారిచ్చింది తీసుకుని వైద్య సేవలు చేయాలని సూచించారు. అనంతరం ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ మధుసూదనరావును పూలమాలలు, జ్ఞాపికలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు ఇంద్రగంటి సుబ్బయ్యశాస్త్రి, శింగారపు వెంకటేశ్వరరావు, షేక్ మీరాసాహెబ్, షేక్ అబ్దుల్లా, షేక్ సైదా, జి.శ్రీనివాసరెడ్డి, పి.సునీల్‌కుమార్, కె.మల్లికార్జునరావు, జ్యోతి మోహనరావు, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చంద్రాజుపాలెం పీహెచ్‌సీ నుండీ ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపిక

బెల్లంకొండ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపిక తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'జాతీయ డెంగీ దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల నుంచి గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాల సీజన్లో దోమల వ్యాప్తి ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులను కలగజేసే దోమల వ్యాప్తి జరుగుతుందని తెలిపారు. మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, వివిధ గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహనా ర్యాలీ

క్రోసూరు: జూలై నెలను ప్రభుత్వం డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ డెంగీ వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ షాద్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అన్నారు. సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, స్టాఫ్ నర్స్ అంజమ్మ, సూపర్‌వైజర్ శివుడు, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధి మాచాయపాలెం ఫీడర్ గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. మాచాయపాలెం ఫీడర్‌లో 11 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. న్యూ చిట్యాల ఆర్ఆర్ సెంటర్, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.